


# ‘దూత’ ఓ కొత్త అనుభూతి

అక్కినేని నాగచైతన్య, పార్వతి తిరువోతు ప్రధానపాత్రధారులుగా విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో శరత్ మరార్ నిర్మించిన వెబ్ సిరీస్ ‘దూత’. ప్రపంచవ్యాప్తంగా 240 దేశాల్లో డిసెంబర్ 1నుంచి ఈ సిరీస్ ప్రసారం కానుంది. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రసారం కానున్న ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ సిరీస్‌ను 54వ అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులందరూ ఈ వేడుకకు హాజరయ్యారు. వీరితోపాటు కంట్రీ డైరెక్టర్, ప్రైమ్ వీడియో సుశాంత్ శ్రీరామ్, శ్రీపృథుల్‌కుమార్, డైరెక్టర్ ఐఫ్‌ఫి, ఎండీ, ఎన్‌ఎఫ్‌డీసీ లిమిటెడ్, జాయింట్ సెక్రటరీ (ఫిలిమ్స్) సమాచార అండ్ ప్రసారమంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం, ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ ఆఫ్ గోవా వైస్ ఛైర్మన్ శ్రీమతి డెలియా ఎం. లోబో కూడా ఈ ప్రీమియర్‌లో పాల్గొన్నారు. ‘ఓటీటీలో నా డెబ్యూకు ఇది పర్‌ఫెక్ట్ సబ్జెక్ట్. ఇన్నాళ్లూ ఓటీటీలో గొప్ప కంటెంట్‌ని చూస్తూ వున్నాను. డిసెంబర్ 1 నుంచి నా కంటెంట్ చూడబోతున్నాను. ఇదో కొత్త అనుభూతి. ఎన్నో గొప్ప కథలను ప్రపంచప్రేక్షకులకు చేరువ చేస్తున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కి ప్రతి కళాకారుడూ కృతజ్ఞత చెప్పుకోవాలి’ అని నాగచైతన్య అన్నారు. తెలుగులో నటించాలనే నా 17ఏండ్ల ఎదురుచూపులను ‘దూత’ సిరీస్ నిజం చేసిందని పార్వతి తిరువోతు అన్నారు. ఇంకా దర్శక, నిర్మాతలు కూడా మాట్లాడారు. ప్రియాభవానీశంకర్, ప్రాచీ దేశాయ్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే.





గురురాజ్, ఆర్.కె.గౌడ్, సత్యప్రకాష్, బందూక్ లక్ష్మణ్

# కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారు

‘తెలంగాణ గత పదేళ్లుగా ప్రగతి పథంలో పయనిస్తున్నది. కేసీఆర్‌గారు మూడోసారి ముఖ్యమంత్రి అయితే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతమవుతాయి. తెలుగు సినీ రంగంలో 24 విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరుతున్నా’ అన్నారు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ‘కేసీఆర్‌గారి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నది. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయితే అభివృద్ధిలో తెలంగాణ నెంబర్‌వన్ స్థానానికి చేరుకుంటుంది. సినీ రంగంలోకి లక్షమంది కుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరుతున్నా’ అన్నారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాలంటే కేసీఆర్ గారు మూడోసారి ముఖ్యమంత్రి కావాలని, మరో ఐదేళ్లు ఆయనతో కలిసి నడుద్దామని నటుడు సత్యప్రకాష్ పిలుపునిచ్చారు. కేసీఆర్ గారు మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని హాస్య నటుడు గౌతమ్‌రాజు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ గురురాజ్, బందూక్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# హుషారైన మాస్ గీతం

నాని, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న నటిస్తున్న తాజా చిత్రం ‘హాయ్ నాన్న’. శౌర్యువ్ దర్శకుడు. వైర ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. మంగళవారం ‘ఒడియమ్మ పాటే మ్రోగాలి’ అనే పాటను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో లాంచ్ చేశారు. పార్టీ థీమ్‌తో రూపొందించిన ఈ పాటలో నాని, శృతిహాసన్ కలిసి నర్తించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటను ధృవ్ విక్రమ్, శృతిహాసన్, చిన్మయి శ్రీపాద ఆలపించారు. నాని మాట్లాడుతూ ‘ఫాస్ట్‌బీట్‌తో సాగే ఈ పాట యువతరాన్ని ఉర్రూతలూగిస్తుంది. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ యువత జోష్ నింపుతుంది’ అన్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, దర్శకత్వం: శౌర్యువ్.



# సామాన్య యువకుడి ప్రస్థానం

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. నేహా శెట్టి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మార్చి 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘చీకటి ప్రపంచంలో సాధారణ స్థాయి నుంచి ధనవంతుడిగా ఎదిగిన ఓ యువకుడి ప్రస్థానాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. ఈ క్రమంలో అతను ఎదుర్కొన్న సవాళ్లు, రాజకీయ పరమైన సంఘర్షణ భావోద్వేగ భరితంగా అనిపిస్తుంది. విశ్వక్‌సేన్ శక్తివంతమైన పాత్రలో కనిపిస్తారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది’ అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అనిత్ మాదాడి, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ నడికుడికర్.

# ఆ క్షణాలకోసం ఎదురుచూస్తున్నా


నిజాయితీ గల కోరికైతే బలంగా అనుకుంటే నెరవేరుతుందని పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం అదే పనిలో ఉంది జాతీయ ఉత్తమనటి కృతి సనన్. జాతీయ వార్డుల వేడుకలో తనకు బన్నీతో కలిసి నటించాలని ఉందని చెప్పింది. జాతీయ ఉత్తమనటుడిగా అవార్డును అందుకోవడానికి బన్నీ ఆ కార్యక్రమానికి రావడం, బన్నీతో కలిసి ఫొటోలకు పోజులివ్వడం.. ఆ సందర్భంలో మీడియా ముందు తన కోరికను తెలియజేయడం జరిగింది. సందర్భం డిమాండ్‌ని బట్టి తను అలా మాట్లాడిందని చాలామంది అప్పట్లో అనుకున్నారు. కానీ కృతిసనన్‌కి ఆ కోరిక బలంగానే ఉన్నట్టుంది. తాజాగా మరోసారి ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మళ్లీ అదే కోరికను వ్యక్తం చేసింది కృతి. ‘అల్లు అర్జున్‌ను తొలిసారి నేషనల్ అవార్డుల ఫంక్షన్‌లో చూశాను. కాసేపు మాట్లాడినా చాలు.. ఎవరైనా అతని అభిమానులు అయిపోతారు. తను అద్భుతమైన నటుడేకాదు, అద్భుతమైన వ్యక్తి కూడా. బన్నీతో కలిసి పనిచేసే క్షణాలకోసం ఎదురు చూస్తున్నాను. మా ఇద్దరికీ తగ్గ కథను ఎవరైనా దర్శకుడు తయారు చేయాలని, అది తర్వగా జరగాలని కోరుకుంటున్నా’ అని అశాభావం వ్యక్తం చేసింది కృతి సనన్.



సుభాష్

# క్లూస్ టీమ్ ఎమోషనల్ అయ్యారు

‘మా నాన్నకు సినిమాలంటే ఇష్టం. యూకేలో ఎంబీఏ పూర్తి చేసి ఇండియాకు వచ్చినప్పుడు నాన్న ఇంట్రస్ట్ తెలిసింది. వెంటనే ఆయనకు సపోర్ట్‌గా నిలిచాను. ఇంతకు ముందు వేరే బేనర్‌లో ఓ సినిమా చేశాం. ‘అథర్వ’ మా రెండో సినిమా’ అని యువ నిర్మాత సుభాష్ నూతలపాటి అన్నారు. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా ప్రధానపాత్రధారులుగా మహేశ్‌రెడ్డి దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం ‘అథర్వ’. డిసెంబర్ 1న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సుభాష్ విలేకరులతో మాట్లాడారు. ‘కథ నచ్చి ఈ సినిమా చేశాం. దర్శకుడు మహేశ్ చాలా డీటైల్డ్‌గా రాసుకున్నాడు. ప్రస్తుతం అందరూ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడుతున్నారు. ఇప్పటివరకూ వెండితెర చూడని థ్రిల్లర్ ఇది. ఎంతో రీసెర్చ్ చేసి ఈ సినిమా చేశాం. రీసెంట్‌గా క్లూస్ టీమ్‌కు ఈ సినిమా ప్రివ్యూ వేశాం. వారంతా చాలా ఎమోషనల్ అయ్యారు’ అని చెప్పారు సుభాష్. నటీనటుల నటన, సాంకేతిక నిపుణుల పనితనం అద్భుతంగా ఉంటుందని, ఖర్చుకు వెనుకాడకుండా ఈ సినిమా నిర్మించామని నిర్మాత తెలిపారు.



ఎస్.కె.ఎన్, విద్య కొప్పినేని, అల్లు అరవింద్, రాహుల్ రవీంద్రన్ తదితరులు

# గర్ల్ ఫ్రెండ్‌గా నేషనల్ క్రష్

ఇన్నాళ్లూ హీరోలతో జతకట్టి ఆడిపాడిన రష్మిక.. ఇప్పుడు సినిమా అంతా తానే అయ్యి, సినిమాను భుజాలపై మోయడానికి రెడీ అయ్యింది. ఆమె ప్రధానపాత్రధారిగా ‘ ది గర్ల్ ఫ్రెండ్’ పేరుతో ఓ చిత్రం రూపొందనుంది. దర్శక, నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ లతో కలిసి ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్నది. విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మాతలు. కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్‌లో లాంఛనంగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్ నివ్వగా, దర్శకుడు మారుతి కెమెరా స్విచాన్ చేశారు. ‘బేబీ’ దర్శకుడు సాయిరాజేశ్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. వైవిధ్యమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం బాగా రావాలని, మంచి విజయం సాధించాలని అతిథులు ఆకాంక్షించారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనున్న ఈ చిత్రానికి కెమెరా: కృష్ణన్ వసంత్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్.

# ఉపేంద్రగాడి మాస్ అడ్డా



‘నన్ను హీరోగా పెట్టి మా నాన్న ఒకేసారి అయిదు సినిమాలు నిర్మిస్తుండటం నా అదృష్టం. తప్పకుండా నా ప్రతిభను నిరూపించుకుంటాను’ అని వర్ధమాన కథనాయకుడు కంచర్ల ఉపేంద్ర అన్నాడు. ఆయన హీరోగా సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ‘ఉపేంద్రగాడి అడ్డా’. కంచర్ల అచ్యుతరావు నిర్మాత. డిసెంబర్ 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కంచర్ల ఉపేంద్ర విలేకరులతో ముచ్చటించాడు. ‘ ఇప్పటికే రెండు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఇక ‘ఉపేంద్రగాడి అడ్డా’ విషయానికొస్తే, ఇదొక యువతరం మెచ్చే మాస్ ఎంటర్‌టైనర్. సందేశం కూడా ఉంటుంది. పెరుగుతున్న సాంకేతికత, ఆండ్రాయిడ్ ఫోన్ల వాడకం సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఇందులో చూపించాం’ అని కంచర్ల ఉపేంద్ర అన్నారు. కొత్తవాళ్లను ప్రోత్సహించాలనే నిర్మాణసంస్థను స్థాపించామని, ‘1920 భీమునిపట్నం’ సినిమా చిత్రీకరణ దశలో ఉందని, ‘ఉపేంద్రగాడి అడ్డా’ సాంకేతికంగా అద్భుతంగా ఉంటుందని కంచర్ల ఉపేంద్ర చెప్పారు.



అర్చన, రాజేంద్రప్రసాద్

# కుటుంబ బంధాలకు దర్పణం

రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘షష్టిపూర్తి’. అలనాడు చక్కటి ప్రజాదరణ పొందిన ‘లేడీస్ టైలర్’లో వీరిద్దరు కలిసి నటించిన విషయం తెలిసిందే. దాదాపు 37 ఏండ్ల విరామం తర్వాత ఈ సీనియర్స్ తిరిగి జోడీ కట్టడం విశేషం. పవన్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రూపేష్ చౌదరి నిర్మిస్తున్నారు. 80శాతం చిత్రీకరణ పూర్తయింది. మంగళవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను యువ దర్శకుడు అనిల్ రావిపూడి ఆవిష్కరించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘పిల్లలు తమ తల్లిదండ్రుల పెళ్లిని చూడరు కాబట్టి..షష్టి పూర్తి ద్వారా భగవంతుడు ఆ లోటును తీర్చుకునే అవకాశం కల్పించాడు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని సుందరమైన గోదావరి లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది’ అన్నారు. కుటుంబ విలువలు ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, త్వరలో కొత్త షెడ్యూల్‌ను మొదలుపెడతామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్, సంగీతం: మ్యాస్ట్రో ఇళయరాజా, దర్శకుడు: పవన్ చంద్ర.



# మౌనం ఆత్మహత్యాసదృశ్యం

ప్రస్తుత కథానాయికల్లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు రష్మిక మందన్నా. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ భాషలకు అతీతంగా అభిమానాన్ని గెలుచుకుంటూ దూసుకుపోతున్నది రష్మిక. దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆమెను ముద్దుగా పిలుచుకునే పేరు ‘నేషనల్ క్రష్’. దటీజ్ రష్మిక. రీసెంట్‌గా పాల్గొన్న ఓ సమావేశంలో తాను ఫేస్ చేసిన డీప్ ఫేక్ వీడియో గురించీ, సెలబ్రిటీలకే కాకుండా, వేలాదిమంది స్త్రీలకు పరువునష్టంగా తయారైన ఈ డీప్ ఫేక్ టెక్నాలజీ గురించి విలువైన విషయాలు మాట్లాడింది రష్మిక. ‘మన బాధ ప్రపంచానికి తెలిసినప్పుడే భరోసా మనకు దక్కేది. కొందరి దుశ్చర్యల వల్ల మన క్యారెక్టర్ ప్రశ్నార్థకంగా మారినప్పుడు, మనం మౌనం వహించడం అంటే అది ఆత్మహత్యాసదృశ్యం. ప్రశ్నించాలి.. ప్రతిఘటించాలి.. అప్పుడే మనకు ప్రపంచం మద్దతుగా నిలుస్తుంది. నాకు అమితాబ్‌సార్ నుంచి చాలామంది పరిశ్రమ పెద్దల సపోర్ట్ లభించడానికి కారణం అదే. దురదృష్టవశత్తూ ప్రస్తుతం ఫేక్ వీడియోలు రావడం కామన్ అయిపోయింది. మిమ్మల్ని బాధించే సంఘటన ఏదైనా సంభవించినప్పుడు మీరు నిశ్శబ్దంగా ఉండొద్దు. మనం గొప్ప దేశంలో ఉన్నాం. మన దేశమే మనకు అండ.’ అంటూ చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా.